ప్రజాశక్తి
బుధవారం 26 మార్చి 2025

స్థానికులతో మాట్లాడుతున్న నిర్మల

తెరపైకి 'పునర్విభజన'

- పార్లమెంట్ స్థానాలు తగ్గుతాయనే ఆందోళన - సామాన్యుల్లోనూ మొదలైన చర్చ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పార్లమెంటు స్థానాల పునర్విభజన ప్రక్రియ తెరపైకి వచ్చింది. ఎప్పుడో 2026లో జరగాల్సిన ఈ ప్రక్రియ ఇప్పుడే మొదలైందనే చర్చ సాగుతోంది. దీనిపై ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళన కూడా మొదలైంది. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేయాలని కేంద్రం నిర్ణయించింది. అందుకు జనాభా లెక్కలు కూడా తయారుచేయలేదు. 2021లో జరగాల్సిన జనాభా లెక్కల ప్రక్రియ కరోనా వల్ల వాయిదా పడింది. అది జరగకుండానే డీలిమిటేషన్ చేయడంపైనా పలు పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి..

కేంద్రం ఎంచుకున్న ప్రస్తుత డీలిమిటేషన్ విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గిపోతాయానే ఆందోళన కూడా పెరిగింది. రాష్ట్రంలోనూ పార్లమెంట్ సీట్ల సంఖ్య తగ్గుతుందని అంచనా. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుతం రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. కేంద్రం ఎంచుకున్న గణాంకాల ప్రకారం ఈ స్థానాల్లోనూ ఓటర్ల సంఖ్య తగ్గే అవకాశాలున్నాయా? పరిధి తగ్గుతుందా? అనేదీ చూడాలి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అయితే గత ప్రభుత్వ హయాం లో జిల్లాల పునర్విభజన ప్రక్రియలో పార్లమెంటు స్థానాన్ని ఒక జిల్లాగా చేశారు. వాటిల్లోనూ హేతుబద్ధత కనిపించలేదు. దీంతో జిల్లాల పునర్విభజన ప్రక్రియను సవరించి కొత్త జిల్లాలు ఏర్పాటు చేయాలనే చర్చ ఉంది. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు కొత్తగా జిల్లాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దానిపై ఇంకా ఏ నిర్ణయం తీసు కోలేదు. డీలిమిటేషన్ ప్రక్రియ ఉన్నందున తర్వాత నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. మళ్లీ మార్పులు చేర్పులు చేయాల్సి వస్తే ఆటంకంగా మారతాయనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అందుకే జిల్లాల విషయంపై ఎంత ఒత్తిడి వచ్చినా సిఎం చంద్రబాబు దానిపై ముందుకు పోవడం లేదు. హామీ అమలుచేస్తామనే మాట పదేపదే చెబు తున్నారు. ఇప్పుడు డీలిమిటేషన్ వ్యవహారం తెరపైకి వచ్చింది. 2011 జనాభా లెక్కల ప్రకారం పార్లమెంటు స్థానాలు ఖరారు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇదే జరిగితే రాష్ట్రంలో స్థానాలు తగ్గుతాయని భావిస్తున్నారు. పార్లమెంటు స్థానాల పరిధి కూడా తగ్గనుంది. ప్రస్తుతం జిల్లాలో 2011 లెక్కల ప్రకారం ప్రస్తుత కర్నూలు జిల్లాలో 22,71,686 మంది, నంద్యాల జిల్లాలో 17,81,777 మంది ఉన్నారు. మళ్లీ జనాభా లెక్కల ప్రక్రియ జరగలేదు. పెరుగుదల ఎంతనేదీ స్పష్టత లేదు. దక్షిణాది రాష్ట్రాల్లో చేపట్టిన విధానాల వల్ల జనాభా తగ్గుదల మాత్రం ఉందని పార్టీలు తమ అభిప్రాయంలో కేంద్రానికి తెలియజేస్తున్నాయి. వైసిపి నుంచీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కూడా ప్రధానికి లేఖ రాశారు. ఇప్పుడున్న జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేస్తే సీట్లు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దామాషా ప్రకారం ప్రతి రాష్ట్రానికి సీట్ల కేటాయింపుపై రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీని వల్ల రాష్ట్రాల్లో సీట్లు అలాగే ఉంటాయని పేర్కొన్నారు. దీనిపై కూటమిలోని తెలుగుదేశం, జనసేన పార్టీలు తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించాల్సి ఉంది. వామపక్షాలు దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా ప్రక్రియ చేపట్టాలని కోరుతున్నాయి. రాష్ట్రంలోనూ ఎంపీ స్థానాలు తగ్గకుండా చూడాలని కోరుతున్నాయి. మరో వైపు రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాలపైనా చర్చ ఉంది. ఈ ప్రక్రియలోనే అసెంబ్లీ స్థానాలను కూడా పెంచుకోవచ్చుని విభజన చట్టంలో పేర్కొన్నారు. వాటిపైనా ఇప్పుడు పార్టీల్లో తర్జనభర్జన సాగుతోంది. 2009 ఎన్నికల నాటికి అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన జరిగింది. అంతకు ముందున్న కొన్ని నియోజకవర్గాలు పోయాయి. విలీనంలో కొత్త నియోజక వర్గాలు వచ్చాయి. దీనిపైనా పార్టీల్లో చర్చ సాగుతోంది. డీలిమిటేషన్ ఎలా జరుగుతుంది? ఏఏ నియోజకవర్గాల్లో మార్పులు చేర్పులుంటాయనే దానిపై ఎవరి అంచనాల్లో వాళ్లున్నారు.



రాష్ట్రానికి అన్యాయం..

పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కూటమి పార్టీలు అనుసరిస్తున్న వైఖరి రాష్ట్రానికి హానికరం. డీలిమిటేషన్‌పై డిఎంకె ఏర్పాటు చేసిన సమావేశానికి దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుండి పార్టీలు హాజరయ్యారు. ఒక్క మనరాష్ట్రం నుండి మాత్రమే హాజరు కాలేదని చెప్పారు. ఈ వైఖరి రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం. మోడీతో దోస్తీ కోసం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారు. జనాభా ప్రతిపదికన సీట్లు కేటాయిస్తే దేశంలో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ లాంటి ఒకటీ రెండు రాష్ట్రాలకు తప్ప ఎక్కువ రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది. బిజెపి పాలిత రాష్ట్రాలకు ఉపయోగం తప్ప దేశంలో మరెవరికీ సీట్లు పెరగవు. దేశాభివృద్ధికి తోడ్పడిన రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గుతుందని వివరించారు. ప్రస్తుతం పార్లమెంటులో ఎంత శాతం సీట్లు పెరుగుతున్నాయో రాష్ట్రాలకూ అలాగే సీట్ల ప్రాతిపదికగా పెరుగుదల శాతాన్ని పరిగణనలోకి తీసుకుని సీట్లు పెంచాలి. ప్రస్తుత జనాభా ఆధారంగా సీట్లు పెరిగితే ప్రాంతీయ అసమానతలు పెరుగుతాయి. ప్రజల మధ్య ఐక్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. సీట్లు తగ్గితే రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంది.

- కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు.

అధికారం కోసమే..

పార్లమెంట్ స్థానాల పునర్విభజన వల్ల ఉత్తరాధి రాష్ట్రాల్లో సీట్లు పెరిగి దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయి. ఇది బిజెపి స్థానాలు పెంచుకునేందుకు చేస్తున్న కుట్ర. కేంద్రంలోని బిజెపి మళ్లీ అధికారంలోకి రావడానికే ఈ ప్రక్రియ చేపడుతోంది. జనాభా ప్రతిపాదికన పార్లమెంట్ స్థానాలను పెంచడాన్ని ఉపసంహరించుకోవాలి.

- గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి.

నేడు కార్పొరేషన్ ముట్టడి

- ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయండి
- ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో మంగళవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల మాట్లాడుతూ కర్నూలు కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం బుధవారం కార్పొరేషన్ ముట్టడి నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విస్తరిస్తున్న కాలనీలలో ప్రధానంగా మంచినీటి సమస్యతో అల్లాడిపోతున్నారని. డ్రైనేజీ వ్యవస్థ గందరగోళంగా ఉందని అన్నారు. చెత్తాచెదారంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో ప్రతి సంవత్సరం ఇంటి పన్నులు 15 శాతం పెంచే విధంగా 198 జీవోను తీసుకువచ్చారని, దాని కారణంగా పేద మధ్యతరగతి ప్రజలు ప్రతి సంవత్సరం పెరుగుతున్న పన్నులతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, తాము అధికారంలోకి వస్తే పన్నులు తగ్గిస్తామని 198 జీవోను రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ నగర్‌లో ప్రజలు అనేక సమస్యలు సిపిఎం బృందానికి తెలిపారు. మార్కెట్ యార్డ్ నుండి వస్తున్న మిరపకాయల ఘాటు వల్ల ముసలి వాళ్ళు, పిల్లలు అనారోగ్యాల పాలవుతున్నారని చెప్పారు. డ్రైనేజీ కాలవలు కనీసం వారానికి ఒకసారి కూడా శుభ్రం చేయడం లేదని, వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని కరెంటు చార్జీలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలయ్యే విధంగా సిపిఎం పోరాడాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు కె.అరుణ, వార్డు కార్యదర్శి ఎం.కుమారి, పిఎస్.సుజాత, అయ్యమ్మ, పర్వీన్, లక్ష్మీదేవి, జమున తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్య యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సిపిఎం న్యూ సిటీ నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. కర్నూల్ 34 వార్డులోని శ్రీనివాస నగర్ ఠాగూర్ స్కూల్ ప్రాంతాలలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి. రాముడు, కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్, నాయకులు ఆర్.జేమ్స్, శంకర్, మాబాషా, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టి.రాముడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో లక్షల రూపాయలు ప్రజలపై మోపిందని, చెత్తను తీసుకెళ్లే వాహనాలు అధికారులు సీజ్ చేయడం వల్ల వాహనాలు విధుల్లోకి రాకపోవడం వల్ల చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. వేసవిలో మంచినీటి కొరత రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైనేజ్, మంచినీటి, ఇళ్ల స్థలాల సమస్యలను ప్రజలు సిపిఎం బృందానికి తెలియజేశారు. 26న జరిగే కార్పొరేషన్ ముట్టడిలో ప్రజలు పాల్గొనాలని నాయకులు కోరారు.

గొందిపర్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కర్నూలు క్రైమ్ : గొందిపర్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం మండల నాయకులు రాఘవేంద్ర, సీనియర్ నాయకులు ఆంజనేయులు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం గొందిపర్లలో వీధి వీధిన తిరిగి అలాగే ఇందిరమ్మ కాలనీలో ప్రచారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందిందని అన్నారు. గొందిపర్ల గ్రామంలో రోడ్లు పూర్తిగా దెబ్బతినిపోయాయని అన్నారు. డ్రైనేజీ నిర్మాణం లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందన్నారు. ప్రతిరోజు శుభ్రమైన మంచినీరు అందించడం లేదని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 28న కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, మునిస్వామి, శివ పాల్గొన్నారు.

గొందిపర్లలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

సిఐటియు రాష్ట్ర వర్క్ షాపును జయప్రదం చేయండి

- ఆయిల్ అండ్ రైస్ మిల్ నగర అధ్యక్షులు గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఏప్రిల్ 12, 13 తేదీలలో కర్నూలులో జరిగే సిఐటియు రాష్ట్ర వర్క్ షాప్‌ను జయప్రదం చేయాలని ఆయిల్ అండ్ రైస్ మిల్ నగర అధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్ కోరారు. మంగళవారం కర్నూల్ నగరంలోని సిఐటియు ఆయిల్ అండ్ రైస్ మిల్ ఆల్ యూనియన్స్ రైస్ మిల్ కార్మికుల సమావేశం కార్మిక కర్షక భవన్‌లో రైస్ మిల్ యూనియన్ నగరకార్యదర్శి సిహెచ్.సాయిబాబా అధ్యక్షతన నిర్వహించారు. డి.గౌస్ దేశాయ్, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు మాట్లాడుతూ ఆయిల్ అండ్ రైస్ మిల్ కార్మికులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం చాలా కష్టంగా మారిందని, మూడు నెలలు పని ఉంటే మూడు నెలలు పని ఉండదని తెలిపారు. కార్మికుల కష్టాలను అర్థం చేసుకొని యజమానులు శ్రమకు తగినట్లుగా కూలి పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఒకవైపు 50 కేజీలు, 25 కేజీల బ్యాగులు ఉండే విధంగా యజమానులు చర్యలు తీసుకోవాలని చెబుతున్నా నిబంధనలను పాటించకుండా 70 కేజీల నుండి 100 కేజీల వరకు బ్యాగులుఉండే విధంగాచేస్తున్నారని, దీంతో కార్మికులు తక్కువ వయస్సులోనే అనారోగ్యాల పాలవుతూ కుటుంబానికి భారంగా మారుతున్నారని తెలిపారు. యజమానులు కార్మికుల ఆరోగ్య గురించి ఆలోచించి ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి 50 ఏళ్ల వయస్సుదాటిన వారికి రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమవేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డి, వేదికపై సిఇఓ

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

జిల్లా పరిషత్ ఛైర్మన్ పాపిరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ పాపిరెడ్డి అన్నారు. జిల్లాపరిషత్ నుండి తాగునీటి సమస్యలు తీర్చేలా పలురకాల పనులకు కేటాయించిన పనుల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని జిల్లా పరిషత్ ఛైర్మన్ అధ్యక్షతన సిఇఒ నాసర రెడ్డి సమక్షంలో జిల్లా పరిషత్ మినీ మీటింగ్ హాలులో మంగళవారం నిర్వహించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల అర్‌డబ్ల్యుఎస్ ,పంచాయితీ రాజ్, డిపిఒ, ఇరిగేషన్, ఐసిడిఎస్ పిడీ పలురకాల అధికారులు హాజరయ్యారు. ఛైర్మన్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడ కూడా పంచాయతీల్లో తాగునీటి సమస్యలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందస్తు చర్యల కింది స్థాయి అధికారులకు సలహాలు, సూచనలు ఇస్తూ పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ నుండి విడుదల చేసిన ప్రతి రూపాయి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమిష్టిగా కృషి చేయాలన్నారు.



ఆర్‌డిఒకు వినతి ఇస్తున్న ఆర్ మండగిరి సర్పంచి ప్రభాకర్ రెడ్డి, గ్రామస్తులు

ఇంటి స్థలాలు ఇవ్వండి

ఆర్ మండగిరి సర్పంచి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-పత్తికొండ : పత్తికొండ మండలం ఆర్ మండగిరి పంచాయతీ పరిధిలోని ఉన్న నిరుపేద ప్రజలకు ఇంటి స్థలాలు ఇచ్చి, పట్టాలు ఇవ్వాలని గ్రామ సర్పంచి ప్రభాకర్ రెడ్డి కోరారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను సర్పంచి, గ్రామస్తులు కలిసి స్పందనలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని , సమస్యను వివరించి వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఆర్ మండగిరి మజరా గ్రామం జూటూరు గ్రామపంచాయతీ సర్వేనెంబర్ 616/1లో 12.30 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఎస్‌సి,ఎస్‌టి, బిసి ,మైనార్టీ నిరుపేద మహిళలు అనేకమంది ఉన్నారని అన్నారు. జగనన్న కాలనీలో గ్రామస్తులకు కేటాయించకుండా బయట వ్యక్తులకు ఇంటి పట్టాలు మంజూరు చేశారని అన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం 10 సెంట్లు భూమిని మంజూరు చేయాలని కోరారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

కెజిబివి అడ్మిషన్లకు పెరిగిన డిమాండ్

-40 సీట్లకు మాత్రమే పరిమితం
-వందల సంఖ్యలోనే దరఖాస్తులు
-సీట్లు పెంచాలని కోరుతున్నతల్లిదండ్రులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇటీవల కాలంలో కస్తూర్బా గాంధీ విద్యాలయాలకు ఆదరణ పెరుగుతుంది. ప్రధానంగా ఈ విద్యాలయాల్లో కేవలం అమ్మాయిలకు మాత్రమే విద్యాబోధన అందిస్తుండడంతో అడ్మిషన్లకు డిమాండ్ పెరుగుతుంది. ప్రతి ఏడాది కెజిబివిలో ప్రవేశాలకు వందల్లో నే దరఖాస్తులు వస్తున్నాయి. సీట్లు మాత్రం అడ్మిషన్ సీట్లను పెంచడంలో అటు సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు వైఫల్యం చెందుతున్నారు. ఇటీవల సమగ్ర శిక్ష అభియాన్ ఉన్నత అధికారులు కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఆరవ తరగతిలో ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 22వ తేదీ నుండి సదరు విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు చర్యలు చేపట్టారు. కర్నూలు జిల్లాలో దాదాపుగా 26 కెజిబివిలు ఉన్నాయి. ఒక్కో కెజిబివిలో కేవలం 40 సీట్లు మాత్రమే ఉంటాయి. అడ్మిషన్ల కోసం పెద్ద ఎత్తున డిమాండు ఉంటుంది. అమ్మాయిల కోసం ప్రత్యేకంగా హాస్టల్ సౌకర్యంతో కూడిన విద్యా బోధనను అందిస్తారు. ప్రైవేట్ కార్పొరేటు విద్యాలయాల్లో తమ పిల్లల్ని చేర్పించలేని నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులు కెజిబివిలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకుంటారు. ఈ విద్యా సంస్థలో ప్రవేశం పొందడానికి మొదటి ప్రాధాన్యతగా తల్లిదండ్రులు లేని పిల్లలకు ఎస్‌సి, ఎస్‌టి,బిసి మైనార్టీ పిల్లలకు రిజర్వేషన్ల వారీగా సీట్లను కేటాయిస్తారు. కర్నూలు జిల్లా లాంటి వెనుకబడిన ప్రాంతంలో లక్షలు పెట్టి పిల్లల కువిద్యను అందించే విద్యార్థుల తల్లిదండ్రుల స్తోమత లేనటువంటి పరిస్థితి ఉంది. నిత్యం కరువు కాటకాలతో అలమటించే ఈ ప్రాంతంలో నిరుపేదలకు విద్య అందడం అందని ద్రాక్ష లానే మారింది. అనేక కుటుంబాల్లో అమ్మాయిలను చదువులకు స్వస్తి పలుకుతూ ఇంటి దగ్గరే పెడుతున్నారు. లేకపోతే చిన్న వయసులోనే అమ్మాయిలకు పెళ్లిళ్లు చేస్తున్న పరిస్థితి నెలకొంది. అలాంటి తరుణంలో ప్రతి కెజిబివిలో అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని పేద విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

కెజిబివిలో అడ్మిషన్ సీట్లు సంఖ్య పెంచాలి

రంగప్ప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎఫ్ఐ

జిల్లాలోని వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో అమ్మాయిలను చదివించడమే గగనంగా మారింది. అలాంటిది అమ్మాయిల కోసం ప్రత్యేకంగా ఉన్నటువంటి కేజీబీవీ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచితే అమ్మాయిలు చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ విద్యా సంవత్సరం లోనైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని అడ్మిషన్ సీట్ల సంఖ్యను పెంచాలి.

నాన్ అప్రూవల్ లేఅవుట్ దారులను వదలం

-200 పైగా రియాల్టర్లకు నోటీసులు
-కుడా ఆదాయాన్ని పెంచుతాం- ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు ఉమ్మడి జిల్లాలో నాన్‌అప్రూవల్ లేఔట్ దారులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని కుడాచైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక కర్నూల్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విచ్చలవిడిగా నాన్ అప్రూవల్ లేఔట్లను పెంచి పోషించిందన్నారు. దీనివల్ల అమాయకులైన ప్రజలు ఇళ్ల స్థలాలను ఇళ్లను కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు కుడా ప్రయత్నిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 14 నియోజకవర్గాలు ఉండగా 9 నియోజకవర్గాల్లోని లేఔట్లలో స్వయంగా తిరిగి పరిశీలించారన్నారు. అనేక లేఅవుట్లు అక్రమంగా వేసినట్లు గుర్తించామన్నారు. అక్రమ లేఔట్ దారులకు ఇప్పటికే 220 దాకా నోటీసులు జారీ చేశామన్నారు. 2017 కు ముందు వేసిన లేఔట్లకు గ్రామపంచాయతీ అనుమతి సరిపోతుందని, ఆ తర్వాత వేసిన లేఔట్లకు కుడా అనుమతి తప్పనిసరి అన్నారు. కూడా అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొంటె కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అప్రూవల్ లేని వాటికి ప్రభుత్వం నుంచి రిజిస్ట్రేషన్లు కానీ, కరెంటు తాగునీరు రోడ్లు డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించబోదన్నారు. అప్రూవల్ లేని లేఅవుట్ దారులపై చర్యలు తప్పమన్నారు. మంత్రాలయంలో నిబంధనలకు విరుద్ధంగా జి ప్లస్ టు కింద గ్రామ పంచాయతీ ద్వారా అనుమతి పొంది దానిపై అదనంగా జి ప్లస్ త్రీ జి ప్లస్ ఫోర్ జి ప్లస్ ఫైవ్ నిర్మాణాలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా లాడ్జిలను నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. దీనిపై సర్వే నిర్వహించి అదనపు నిర్మాణాలకు క్రమబద్ధీకరణ కింద తగిన అపరాధ రుసుములను కుడాకు చెల్లించాలన్నారు. ఇది కేవలం ప్రభుత్వ ఆదాయాన్ని, కుడా ఆదాయాన్ని పెంచేందుకే అన్నారు. అక్రమ లేఅవుట్ దారులు స్పందించి సరి చేసుకోకపోతే వారికి కుళాయిలను, కరెంటును కట్ చేస్తామని హెచ్చరించారు. నాన్ అప్రూవల్ లేవట్లలో ప్లాట్లను కొనవద్దని కొంటె ఎలాంటి నష్టాలు చేకూరుతాయో అని వివరిస్తూ కరపత్రాలు మైక్ సెట్ అనౌన్స్‌మెంట్ల ద్వారా వాల్పోస్టర్ల ద్వారా అవగాహన కార్యక్రమాన్ని కల్పిస్తున్నామని అన్నారు.

మాట్లాడుతున్న కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం కర్నూలు నగరంలోని డివిఆర్ మాన్సస్‌లో మలబార్ గోల్డ్ సంస్థ స్కాలర్షిప్ పొందిన విద్యార్థులకు స్కాలర్షిప్ కార్యక్రమం నిర్వహించారు. స్టోర్ హెడ్ ఫయాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ మలబార్ సంస్థ నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయడం అభినందనీయమని అన్నారు. సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆమె కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లా లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్య నభ్యసిస్తున్న 209 మంది విద్యార్థినులకు రూ.18,64,000 స్కాలర్ షిప్ మొత్తం ను చెక్కు ద్వారా అందజేశారు. బి- ఈ కార్యక్రమంలో డివిఇఒ వై .పరమేశ్వర రెడ్డి , వివిధ కళాశాల ల ప్రిన్సిపల్స్ , మలబార్ గోల్డ్ సంస్థ వారి సిబ్బంది ఫయాజ్, నురుల్లా, మరియు విద్యార్థినిలు , వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతిని తెలుసుకుంటున్న హౌజింగ్ అధికారులు

ఇళ్ల నిర్మాణ పురోగతిపై తనిఖీ

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని బురాన్ దొడ్డి, కంభదహాల్ గ్రామాల్లో ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ ఇఇ వెంకట దాస్, డిఇ వాసుదేవరావులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ గ్రామాల్లో నిర్మాణాలు పుంజుకున్నట్లు సంతప్తిని వ్యక్తపరిచారు. పూర్తి స్థాయిలో నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించాలని హౌసింగ్ ఎఇ సుమంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్నలకు సూచించారు. అవసరమైతే గ్రామాల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు కూడా అందించాల్సిన బాధ్యత మనకుందని పేర్కొన్నారు.

పకడ్బందీగా రీసర్వే : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - నందవరం

రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలో పర్యటించారు. నది కైరవాడి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో జరుగుతున్న భూరీసర్వే పర్యవేక్షించారు. అనంతరం నాగలదిన్నె గ్రామాన్ని సందర్శించారు. సర్వే నెంబరు 59/సిలో విస్తీర్ణం 2.1/2 సెంట్లలో శ్మశాన నాగప్ప అక్రమంగా కమ్యూనిటీ పర్పస్ కోసం కేటాయించిన స్థలంలో కట్టిన ఇంటి నిర్మాణంపై వచ్చిన ఫిర్యాదుపై నిర్మాణాన్ని తనిఖీ చేశారు. కనకవీడు గ్రామం సర్వే నెంబరు 639లో 1.55 ఎకరాల శ్మశాన భూమిని సరిహద్దు పట్టాదారులు ఆక్రమణ చేసినట్లు కనకవీడు గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సరిహద్దులు పరిశీలించారు. తహశీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రీసర్వేపై అధికారులకు సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్

అంగన్వాడీలకు రూ.26 వేల వేతనమివ్వాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడీలకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం రెవెన్యూ భవన్‌లో అంగన్వాడీల సమావేశం సోమక్క అధ్యక్షతన జరిగింది. రాధాకృష్ణ, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.వెంకటమ్మ, ప్రాజెక్టు అధ్యక్షులు వరలక్ష్మి, సిఐటియు నాయకులు తిప్పన్న, పిఎస్.గోపాల్, రామాంజనేయులు, వీరారెడ్డి హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె చేసే దీక్ష శిబిరాల దగ్గరికి వచ్చిన కూటమి నాయకులు అంగన్వాడీలకు న్యాయం చేస్తామని.. తగిన వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి 10 నెలలైనా హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. వాగ్దానాలు అమలు చేయాలని, అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. గ్రాట్యుటీ అమలు చేయాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు రూరల్ కమిటీ అధ్యక్షులుగా గీత, కార్యదర్శిగా వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కరుణ, శాంతి, ధనలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా రిజ్వానా, కృష్ణవేణి, లక్ష్మి, కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

భూసమస్యల పరిష్కారానికి కృషి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - హాలహర్వి

భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని కామినహాల్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని రైతులను కోరారు. భూ సమస్యలపై ఫిర్యాదు దిగువయా సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. భూ సమస్యలు పరిష్కారం కోసమే రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కెజిబివి పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. తహశీల్దార్ నజ్మ భాను, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీ, వీఆర్‌ఓ మస్తాన్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

మరమ్మతులకు పరికరాలు ఇవ్వండి

- కెజిబివి ప్రిన్సిపల్ శాంతి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చిలుకలడోణ గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో గత నెల రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, చేతి పంపు మరమ్మతులు చేయించడానికి పరికరాలు ఇవ్వాలని ప్రిన్సిపల్ ఎస్.శాంతి కోరారు. మంగళవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో చిలకలడోణ పంచాయతీ కార్యదర్శి ప్రత్యూషకు కెజిబివి పాఠశాల ఉపాధ్యాయులు స్వప్న, స్వీపర్ మస్తానమ్మతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో పాఠశాల విద్యార్థులకు తాగునీటి సమస్య ఉండేది కాదని, ఇటీవల గ్రామానికి వచ్చే పైపులైన్ మార్చడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం చేతి పంపు మరమ్మతులు చేయించాలని ఎంపిడిఒ రాధాకు కూడా వినతిపత్రం అందించామని తెలిపారు. చేతి పంపునకు అవసరమైన సామగ్రి ఒక ఫుట్‌బాల్, 5 బోర్‌వెల్ పైపులు, 8 ఐరన్ చిన్న పైపులు ఇవ్వాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు, నాయకులు బి.అనిల్, దేవపుత్ర పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్, నాయకులు

పేదల భూమి ఆక్రమణ..!

- అధికారం అండతోనే భూఆక్రమణ
- మా భూమి మాకిచ్చి ఆదుకోవాలి : బాధిత రైతు

ప్రజాశక్తి - ఆలూరు

పేదల భూమిని అక్రమంగా ఆక్రమించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని భూమి ఆక్రమణకు పాల్పడినట్లు బాధితులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఆలూరులోని బెల్లిగుండు ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లే మార్గంలో ఎడమ వైపు సర్వే నెంబరు 791/ఎలో 3.16, 795లో 0.56 ఎకరాల సాగు (వంక పోరంబోకు) భూమి ఉంది. ఈ భూమికి కొందరు అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడంతో తమకు న్యాయం చేయాలని సాగుదారులు అధికారులను కోరుతున్నారు.

పంట సాగు చేసుకొని జీవనం సాగించేందుకు 1916–17వ సంవత్సరంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఆలూరులో వంక పోరంబోకు, బంజరు భూములను నిరుపేద దళితులకు ఇచ్చింది. అందులో భాగంగానే ఆలూరుకు చెందిన నర్సప్పకు సర్వే నెంబరు 791/ఎలో 3.16, 795లో 0.56 భూమిని పంట సాగు చేసుకోవడానికి 'డి' పట్టా ఇచ్చింది. అప్పటి నుంచి నర్సప్ప, నర్సప్ప కుటుంబ సభ్యులు.. మనుమళ్లు రాముడు, ఉలింగప్ప 2021వ సంవత్సరం ఖరీఫ్ సీజన్ వరకు పంట సాగు చేశారు. 2013, 16లో పంట నష్ట పరిహారం నర్సప్పకు రూ.15 వేలు అందింది. 1975లో అధిక వర్షాలతో తమ పాత ఇళ్లు కూలిపోవడంతో ఇంటి సామగ్రి, 'డి' పట్టా మట్టిలో కలిసిపోయాయని బాధితులు పేర్కొంటున్నారు. అప్పటి నుంచి మండల రెవెన్యూ, డివిజన్ అధికారికి, కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చి తిరిగినా 'అదిగో.. ఇదిగో' అంటూ కాలయాపన చేశారని వాపోతున్నారు.

అధికారుల అండదండలతో భూఆక్రమణ

తాము పంట సాగులో ఉన్నప్పుడే 2008–09లో అప్పటి ఆలూరు ఎమ్మెల్యే మారెప్ప బంధువు జోలన్న అలియాస్ ఏసన్న కుమారుడు హెచ్.రాజన్నకు ఆలూరు తహశీల్దార్ రంగన్న 1047 ఖాతా నెంబరుతో పట్టపాసు పుస్తకం ఇచ్చారని బాధితులు వాపోతున్నారు. ఆ సమయంలోనే ప్లాట్లు అమ్ముతున్నట్లు పాంప్లెట్స్ కొట్టి పంచడంతో తాము అడ్డుకోవడంతో ప్లాట్ల అమ్మకం ఆగిపోయిందని నర్సప్ప కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. 2016, మార్చి నెల వరకు అనుభవదారుని కింద నర్సప్ప పేరుపై ఆన్‌లైన్‌లో 1బి, అడంగల్ ఉంది. నవంబర్ నెలలో ఆన్‌లైన్‌లో హెచ్.రాజన్న పేరుపై అప్పటి తహశీల్దార్ సూర్యనారాయణ ప్రసాద్ 1బి, అడంగల్ ఆన్‌లైన్‌లోకి మార్చినట్లు తెలిసింది. 2018లో ఆంజనేయ స్వామి దేవాలయ నిర్వాహకులు సర్వే నెంబరు 791/ఎలో 0.25 సెంట్లు ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు అడగగా.. 'ఈ భూమి నాది' అని రాజన్న హై కోర్టులో స్టే తెచ్చారు. రాజన్నతో దేవాలయ నిర్వాహకులు సంప్రదింపులు చేసుకొని విగ్రహ ఏర్పాటుకు కొంత స్థలాన్ని తీసుకున్నారు. సాగుదారులమైన తమను భూమిలోకి రానివ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు వాపోతున్నారు. తమ భూమిలో అక్రమంగా పంట సాగు చేస్తున్నారని నర్సప్ప మనుమడు రాముడుపై రాజన్న ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు ఆలూరు కోర్టులో వాయిదాలతో నడుస్తోంది. కేసు కోర్టులో ఉండగా సర్వే నెంబరు 791/ఎలో గల భూమికి కంచె వేసి ప్లాట్లు వేసి అమ్మకానికి పెడుతున్నట్లు సమాచారం రావడంతో మూడు రోజుల క్రితం ఆలూరుకు వచ్చిన జెసి నవ్యకు సాగుదారులు ఫిర్యాదు చేశారు. కోర్టులో కేసు ఉండగా కంచె ఎలా వేస్తారని నోటీసులు ఇచ్చి కంచెను తొలగించాలని ఆలూరు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆ భూమిలో తమకు కొంత భాగం ఇస్తే తమకు సహకరిస్తామని రాజన్నతో సంప్రదింపులు చేస్తున్నట్లు తెలిసింది. ఆలూరులో కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

మా భూమి మాకిచ్చి ఆదుకోవాలి

- బాధిత రైతు రాముడు

ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం మా తాత నర్సప్పకు ఇచ్చిన భూమిలో పంట సాగు చేసుకొంటున్నాం. ఆ భూమిపై కబ్జాదారుల కన్ను పడి మాపైనే కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారు. అధికారులు మా భూమిని మాకు ఇప్పించి పంట సాగు చేసుకోవడానికి సహకరించాలి.

చలివేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి బస్టాండ్ దగ్గర అంబేద్కర్ సర్కిల్‌లో చలివేంద్రం ఏర్పాటు చేయాలని విద్యార్థులు, మండలానికి పనుల మీద వచ్చే ప్రయాణికులు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. విద్యార్థులు వెంట తీసుకొచ్చిన వాటర్ బాటిల్ పాఠశాల విడిచేలోపు అయిపోతాయని, బస్టాండ్ దగ్గరకు వస్తే హోటళ్లలోను, కూల్ డ్రింక్ షాపులోను తాగడానికి వెళితే వ్యాపారం చేయమని అడుగుతున్నారు. షాపులోకి వెళ్లలేక ఎర్రని ఎండకు బస్సులు వచ్చేంత వరకు స్థానిక బస్టాండ్‌లోనే నిలబడాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. తాగటానికి నీరు దొరకక విద్యార్థులతో పాటు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చలివేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలపై స్పందించండి

- సిఐటియు జిల్లా నాయకులు ఆనంద్ బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్, సిఐటియు మండల నాయకులు బతుకన్న, మునెప్ప, నబీ రసూల్ కోరారు. మంగళవారం గోనెగండ్ల మేజర్ పంచాయతీ సర్పంచి హైమావతి, కార్యదర్శి సతీష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గోనెగండ్ల పంచాయతీలో పారిశుధ్య సేవలందించే 10 మంది కార్మికులకు గతేడాదిలో 3 నెలల జీతాలు రూ.11 వేల చొప్పున అందించారని, ప్రస్తుతం మరో రెండు నెలల జీతం రూ.10 వేలు ఇచ్చారని తెలిపారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెంచిన జీతాల్లో కోత విధించడం దారుణమని చెప్పారు. అలాగే స్వచ్ఛభారత్ కార్మికుల్లో కొందరికి రూ.6 వేలు, కొందరికి రూ.5 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. పంచాయతీ కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికుల చేత వెట్టిచాకిరీ చేయించుకుని వేతనాల్లో కోత విధించడం సరికాదన్నారు. పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు లింగన్న, వరలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, మధుమతి, స్రవంతి, ఎస్తేరమ్మ, ఆదిలక్ష్మి, నరేష్, రాజు, రాములమ్మ, వీరలక్ష్మి, నాగమ్మ పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరు మేజర్ పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి కోరారు. సిపిఎం ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి జ్యోతిబసు భవన్ నుంచి ర్యాలీగా నినాదాలు చేస్తూ ఆలూరు మేజర్ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. మైనా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సిపిఎం కాలనీలో అదనంగా మినీ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని, సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. చెడిపోయిన చేతి పంపుల మరమ్మతులు చేపట్టాలన్నారు. డ్రెయినేజీ కాలువలో పూడికలు తీయాలని, వారానికోసారి కాలువలో బ్లీచింగ్ పౌడర్ వేయాలని, ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, సంపులను నెలకోసారి శుభ్రం చేయాలని కోరారు. ఆలూరు ప్రాంతంలో 15 రోజులకోసారి తాగునీరు వదలడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసినా అధికారులకు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. గత 15 ఏళ్ల నుంచి సిద్దేశ్వర నగర్, సిపిఎం కాలనీలో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని తెలిపారు. సిద్దేశ్వర నగర్, సిపిఎం కాలనీలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో తీగలు కిందికి వేలాడుతున్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఆందోళన చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. పంచాయతీ అధికారులు, మండల విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన తాగునీటి సమస్యను, సిసి రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు వేయాలని కోరారు. లేకపోతే పంచాయతీ, విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌కు, విద్యుత్ ఎఇ గుర్రప్పకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు విఠల్, ఈరన్న, నాగరాజు, వీరేష్, గోవర్దన్, నరసింహులు, ఓబులేసు, ఐద్వా నాయకులు షేకున్ బీ, రాధా, స్వాతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నజీర్ అహ్మద్

ఎమ్మెల్యే బీవీతోనే పట్టణాభివృద్ధి

- టిడిపి వార్డు ఇన్‌ఛార్జీ నజీర్ అహ్మద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డితోనే పట్టణాభివృద్ధి సాధ్యమని 2వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జీ తురేగల్ నజీర్ అహ్మద్ తెలిపారు. ఎమ్మెల్యే బీవీ సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని చెప్పారు. 2వ వార్డులో ఎమ్మెల్యే చొరవతో చేపట్టిన పైపులైన్, కల్వర్టు, సిసి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం పట్టణంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేసింది లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే బీవీ ప్రతి వార్డును పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అన్ని వార్డుల్లోనూ సిసి రోడ్డుతో పాటు ఇతర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. రానున్న 6 నెలల్లో పట్టణం రూపురేఖలు మారుతాయని తెలిపారు. టౌన్ బ్యాంకు డైరెక్టర్ వాల్మీకి రాజు, సరోజమ్మ, భూత రమేష్, రాజేశ్వరి పాల్గొన్నారు.

అర్హులకే బీసీ కార్పొరేషన్ రుణాలు : అంజి యాదవ్

ప్రజాశక్తి - చిప్పగిరి

బీసీ కులాల్లో వెనుకబడిన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇస్తుందని, రాజకీయ పెద్దలు అర్హత ఉన్న వారిని పక్కకు నెట్టేస్తున్నారని బీసీ సంక్షేమ ప్రధాన కార్యదర్శి, టిడిపి నియోజకవర్గ ఉపాధ్యక్షులు అంజి యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. రాజకీయ పెద్దలు సూచించిన వారికి బీసీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్ నిధులంటేనే ఉన్నతాధికారులు, బ్యాంకు అధికారులు చూసుకొనే పద్ధతి అని, అందులో రాజకీయ నాయకులు తల దూర్చి 'మా అనుచరులకే రుణాలు మంజూరు చేయాల'ని ఒత్తిడి తేవడం మంచి పద్ధతి కాదని తెలిపారు. అధికారులు, బ్యాంకు వారు అర్హత ఉన్న వారికే రుణాలు మంజూరు చేయాలని కోరారు.

భోజన పంపిణీని బాధ్యతగా చేపట్టాలి

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అన్న క్యాంటీన్‌లో భోజన పంపిణీని బాధ్యతగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.గంగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌లో భోజన పంపిణీని తనిఖీ చేశారు. ప్రజలతో మాట్లాడి అక్కడి పంపిణీ, పారిశుధ్యం గురించి ఆరా తీశారు. సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే పట్టణంలోని పార్కు రోడ్డు, ట్యాంక్ బండ్ రోడ్, షరాఫ్ బజార్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలి

- కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ఎండ వేడి రోజురోజుకూ అధికమవుతోందని, ఈ సమయంలో తాగునీరు చాలా అవసరమని, పాదచారుల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ కోరారు. మంగళవారం పట్టణంలోని బండి మెట్ట ప్రాంతంలో యూత్ నెలకొల్పిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కందనాతి మారెమ్మ అవ్వ దేవాలయం ఆవరణలో భక్తులకు అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తలకు తప్పనిసరిగా టోపీ ధరించాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు 5 లీటర్ల నీరు తాగాలని తెలిపారు. జనసంచారం ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. మున్సిపాలిటీ ద్వారా చలివేంద్రాలకు నీరు సరఫరా చేస్తామన్నారు. మున్సిపల్ ఉద్యోగులు కృష్ణ, నరసింహ ఉన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బి.గోకారి (35) కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. గోకారి ఈనెల 22న వ్యక్తిగత పనులు ముగించుకొని కర్నూలు నుంచి మోటార్ సైకిల్‌పై గ్రామానికి తిరిగి వస్తుండగా నాగలాపురం గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కింద పడి గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

చిన్నారులకు తప్పని ఇక్కట్లు

- ఈకేవైసీకి ఈనెలాఖరు వరకు గడువు
- గడువు పెంచాలంటున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద అర్హులకు సంక్షేమ పథకాలు అందించడానికి పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా రేషన్‌కార్డులకు ఈకేవైసీ తప్పనిసరి చేసింది. ఏప్రిల్ 1 నుంచి ప్రతి పథకం అమలుకు ఈకేవైసీ ఉండాలని ప్రభుత్వం నిబంధన జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆదోని పరిసర ప్రాంతాల ప్రజలు వేల సంఖ్యలో ఈకేవైసీ చేయించుకునేందుకు పట్టణ ప్రాంతానికి తరలి వస్తున్నారు.

గతంలో ప్రతి ఆధార్ కేంద్రంలోనూ ఈకేవైసీ నమోదుకు వెసలుబాటు ఉండేది. ఇటీవల మీసేవలో ఈ ఆప్షన్ తొలగించి ఆంధ్రా బ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఒకే ఒక్క ప్రభుత్వరంగ మీసేవకు అనుమతి ఇచ్చారు. ఈ కారణంగా ఇటు విద్యార్థులు, అటు చిన్న పిల్లలు ఈకేవైసీ కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఈకేవైసీ నమోదుపై నూతన డీలర్లకు అవగాహన లేకపోవడంతో కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈకేవైసీ నమోదు ప్రక్రియపై సంబంధిత శాఖాధికారులు డీలర్లకు అవగాహన కల్పించకపోవడంతో విధి విధానాలు తెలియక ప్రజలను తిప్పుకుంటున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగం ఈకేవైసీ నమోదుపై తక్షణ చర్యలు చేపట్టాలని సామాన్యులు డిమాండ్ చేస్తున్నారు. అందుబాటులో ఉన్న రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకోవాలని పౌరసరఫరాల శాఖాధికారులు సూచించారు. స్వగ్రామం, పట్టణాల్లో ఎక్కడి వారు అక్కడ నమోదు చేసుకున్నారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు, విదేశాలకు బతుకుదెరువు కోసం వలస వెళ్లిన వారి ఈకేవైసీ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఈనెల 31తో గడువు ముగియనుంది. మండలంలో ఇంకా వేలల్లో లబ్ధిదారులు నమోదు చేసుకోలేదు. రేషన్‌కార్డుల ఈకేవైసీ ప్రక్రియ గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. సంకేతిక కారణాల వల్ల, వివిధ కారణాలతో పలువురు ఈకేవైసీ పూర్తి కాకపోవడంతో గడువును పెంచాలని పేర్కొంటున్నారు.

ఈకేవైసీ కోసం పడిగాపులు కాస్తున్న చిన్నారులు

'సమస్యను పరిష్కరించే వరకు పోరాటం'

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చిలకలడోణ ఎస్సీ కాలనీ మూడో వార్డులో నీటి ఎద్దడిని పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి జయరాజు, బిఎస్‌ఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవపుత్ర డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో చిలుకలడోణ గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రత్యూషకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు అనిల్, ప్రాణేష్, లక్ష్మన్న పాల్గొన్నారు.

మార్కెట్ వేలం మరోసారి వాయిదా

ప్రజాశక్తి - ఆదోని

ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌కు వేలం మరోసారి వాయిదా వేశామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో కమిషనర్ కృష్ణ ఆధ్వర్యంలో వేలం నిర్వహణకు మంగళవారం ఏర్పాట్లు చేశారు. సర్కారు వారి పాట మొత్తం రూ.76 లక్షలుగా నిర్ధారించడంతో తమకు గిట్టుబాటు కాదని గుత్తేదారులు వేలాన్ని బహిష్కరించి బయటికి వెళ్లిపోయారు. గుత్తేదారులు మాట్లాడుతూ... బయటి నుంచి వచ్చే లారీ నుంచి సుంకం వసూళ్లకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్‌లో కూరగాయల వేలం ద్వారా సుంకం వసూలు చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వాలని కోరారు. వాటి నుంచే ఆదాయం వస్తుందని, అవి లేకపోతే గిట్టుబాటు కాదని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ... నోటిఫికేషన్ రాకముందే సమస్యలు తెలిపి ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఏమీ చేయలేమని స్పష్టం చేశారు. బుధవారం మరోసారి వేలం నిర్వహణకు ఏర్పాటు చేస్తామని, అప్పటికీ ఎవరూ రాకపోతే అధికారుల నిర్ణయం మేరకు సుంకం వసూలు ఏ విధంగా చేయాలన్నది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, రెవెన్యూ ఆఫీసర్ నసీర్ అహ్మద్, ఆర్ఐ చంద్రమోహన్, షేక్షావలీ, గుత్తేదారులు తిమ్మప్ప, బుద్ధారెడ్డి, వెంకటేష్, జయరాం, కాశీ, వీరేష్, రవి, లక్ష్మీనారాయణ, చిట్టి, నారాయణ, సుబ్బు ఉన్నారు.

అధికారులతో మాట్లాడిన కాంట్రాక్టర్లు

నవోదయ ఫలితాల్లో ఆజాద్ ప్రభంజనం

ప్రజాశక్తి - ఆస్పరి

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఆజాద్ కోచింగ్ సెంటర్ ప్రభంజనం సృష్టించింది. 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కోచింగ్ పొందిన నారాయణ ఫ్రెమ్స్ స్కూల్ విద్యార్థులు మంగలి విష్ణు మదన్, దబ్బల విష్ణు ప్రియ, కె.లక్ష్మీ ప్రసన్నలు ప్రతిభ చాటి సీటు పొందారు. వీరితో పాటు దీపిక, భాను ప్రకాష్, హంశిక వర్షిని, సాయి కార్తాయిణీ సీట్లు సాధించారు. గతేడాది కూడా ఆజాద్ కోచింగ్ సెంటర్‌లో నవోదయలో సీట్లు సాధించారు.

'నవోదయ'లో నారాయణ ఫ్రెమ్స్ జయ కేతనం

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మూడు సీట్లను పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకోవడం పట్ల ప్రధానోపాధ్యాయులు నరేష్ ఆచారి మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. నవోదయ పరీక్షల్లో విజయం సాధించిన వారికి మిఠాయిలు తినిపించి సంబరాలు జరుపుకున్నారు. ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు, కోచింగ్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

నవోదయకు ఎఫ్ఆర్ విద్యార్థులు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ ఎఫ్ఆర్ ఎలిమెంటరీ స్కూల్‌లో చదువుతున్న ఈడిగ శివకుమార్ గౌడ్, సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో చదువుతున్న హుమ్షిక ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్లు పి.రఘునాథ్, కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు బి.ఉచ్చీరప్ప, ముజీపూర్ రెహమాన్ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కార్మిక హక్కులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు కోరారు. మంగళవారం సిఐటియు మండల అధ్యక్షులు పి.గోవిందు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. కార్మికులకు, ఉద్యోగులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను చట్టాలు చేసి అమలు చేయడానికి సిద్ధమవుతోందని మండిపడ్డారు. కనీస వేతన హక్కు చట్టం, గ్రాట్యుటీ, పింఛను, పని భద్రత, సెలవులు ఇతర సౌకర్యాలు లేకుండా చట్టాల వల్ల కార్మికుల హక్కులు పూర్తిగా హరించిపోతాయని తెలిపారు. నేటికీ 40 కోట్ల మంది కార్మికులకు కనీస వేతనాలు లేకపోవడం, పింఛను సౌకర్యం లేకపోవడం విచారకరమన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను రద్దయ్యే వరకు ఉద్యమించాలని కోరారు. సిఐటియు నాయకులు ప్రవీణ్ కుమార్, బి.రాజు, బి.గోవర్ధనమ్మ, ఎస్.నాగలక్ష్మి, బి.శివలక్ష్మి, విజయమ్మ, కె.దేవకుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే జీవన వికాసం

- సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - హోళగుంద

విద్యతోనే జీవితం వికసిస్తుం దని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సూచిం చారు. మంగళవారం అంబేద్కర్ ఎస్‌హెచ్‌జి, వరలక్ష్మి ఎస్‌హెచ్‌జి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టళ్లను పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ హాస్టళ్లలో అన్ని సౌకర్యాలూ అందుబాటులో ఉన్నాయని, నాణ్యమైన భోజనం, డిఎడ్, బిఎడ్ ఉపాధ్యాయులతో విద్యనందిస్తున్నట్లు తెలిపారు. సిఎంఒ శివశంకర్, ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సిహెచ్.నాగరాజు, సిఆర్ఎంటిలు తుకారాం, రేణుక, అటెండర్ మల్లయ్య, సీజనల్ హాస్టల్ ఉపాధ్యాయులు దుర్గయ్య, సోహెబ్ పాల్గొన్నారు. **హాలహర్వి** మండలం నిట్రవట్టి గ్రామంలో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న సీజనల్ హాస్టళ్లను ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పరిశీలించారు. జిల్లా సమగ్ర శిక్ష సిఎంఒ శివశంకర్, జడ్‌పిటిసి లింగన్న, ఉపాధ్యాయులు అయ్యన్న గౌడ్, కేర్ టేకర్ లక్ష్మన్న, వంటమనిషి లక్ష్మి పాల్గొన్నారు.

హోళగుందలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు